
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 6 జూన్ 2025
5



ప్రతీ సమస్యను పరిష్కరించండి

- అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలు
- నగరంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని నిర్ణయం
- హలో కమిషనర్ కార్యక్రమానికి వెల్లువెత్తిన కాల్స్



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

ఖమ్మం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు ఇబ్బందిగా మారుతున్న ప్రతీ సమస్యను పరిష్కరించండి' అని కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పలు విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని సమస్యలపై గురువారం 'హలో కమిషనర్' పేరుతో 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ఫోన్ కాల్స్ వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యల పట్ల కమిషనర్ స్పందిస్తూ.. సమస్యకు అనుగుణంగా చర్యలు చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఫోన్ ఇన్ ద్వారా సమస్యను వివరిస్తున్న సమయంలోనే సంబంధిత విభాగాల అధికారులకు ఆయా సమస్యలు పరిష్కరించేలా ఆయన సూచనలు చేశారు. అత్యధికంగా దృష్టికొచ్చిన సమస్యలను గుర్తించి.. స్పెషల్ డ్రైవ్ పెట్టేలా, సంబంధిత శాఖల వారీగా అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో నీళ్ల నిలిచి పిచ్చి మొక్కలు ఉండి పడుతున్న ఇబ్బందులపై గతంలో ప్రతీ బుధ, గురువారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మరికొన్ని చోట్ల డ్రెయినేజీ సమస్యలపై పారిశుధ్య విభాగం అధికారులకు, రోడ్లను ఆక్రమించి ర్యాంపులు కట్టడం, ఆపై పార్కింగ్ కోసం షెడ్లు ఏర్పాటు చేయడం లాంటి అంశాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు, వీధి లైట్లకు సంబంధించి ఎలక్ట్రికల్ అధికారులకు, మరికొన్ని ఇంజనీరింగ్ సమస్యలపై సంబంధిత అధికారులకు ఆయా సమస్యలు పరిష్కార సూచనలు చేశారు. డివిజన్లలో కుక్కల సమస్యల పట్ల జవాన్లతో డివిజన్ల వారీగా సర్వే చేయించి ఆ సమస్యను పరిష్కరించాలని యానిమల్ బర్త్ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. చికెన్ వ్యర్థాలను రోడ్లపై వేయడం ద్వారా దుర్వాసన వెదజల్లుతున్నట్టు పలు ఫిర్యాదులు రాగా... ముందుగా ఆయా వ్యర్థాలను అక్కడ నుంచి తొలగించడంతోపాటుగా, అక్కడ వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకొని మళ్లీ సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య విభాగం వారిని ఆదేశించారు.



'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, పాల్గొన్న అధికారులు

ప్రజలు విన్నవించిన సమస్యల్లో కొన్ని... 6



వనజీవే మనకు స్ఫూర్తి


- రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి
- ఏపీ వనమహోత్సవంలో రామయ్యను గుర్తుచేసిన ఏపీ సీఎం చంద్రబాబు



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'వనజీవి రామయ్యే మనకు స్ఫూర్తి. పర్యావరణ పరిరక్షణలో మొన్నటి వరకు ఆయన్ను అందరూ చూశారు. ఇకపై ఆయన స్ఫూర్తితో విద్యార్థులు మొక్కలు పెంచి వన సంరక్షణ చేపట్టాలి' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యార్థులకు సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని అనంతవరంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనగా.. సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఖమ్మానికి చెందిన వనజీవి దరిపల్లి రామయ్యను గుర్తు చేశారు. జీవించినంత కాలం రామయ్య వన సంరక్షణ కోసం ఎంతో కృషి చేశారని వివరించారు.



ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మారిన మైనింగ్ కళాశాల



ఎర్త్ సైన్స్ వర్సిటీకి మంత్రివర్గ ఆమోదం

- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఖరారు చేస్తూ నిర్ణయం
- దేశంలోనే మొదటి వర్సిటీగా గుర్తింపు
- ప్రపంచ స్థాయిలో పెరిగిన ఉమ్మడి జిల్లా ఖ్యాతి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొత్తగూడెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో గతంలో భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఉన్న మైనింగ్ కళాశాలను ఇటీవల ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ అయిన విషయం తెలిసిందే. 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో పాటు.. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీగా నామకరణం చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మైనింగ్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి.. యూనివర్సిటీగా మార్చిన కాంగ్రెస్ సర్కారు.. మరో ముందడుగు వేస్తూ గురువారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ ఆర్థిక వేత్త, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును ఖరారు చేయడం పట్ల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఖనిజ సంపదకు నిలయమైన భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయానికి మాజీ ప్రధాని పేరు పెట్టడంతో దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించనుంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

300 ఎకరాల్లో విశ్వ విద్యాలయం..

దేశంలో ఎక్కడా లేని విధంగా 300 ఎకరాల్లో అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటవుతున్న ఈ వర్సిటీ వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాల కేంద్రంగా మారనుంది. ప్రస్తుతం గతంలో ఉన్న మైనింగ్ కళాశాల మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ విశ్వ విద్యాలయంగా మారడంతో వేలాది మంది యువ శాస్త్రవేత్తలు ఇక్కడి నుంచే దేశ భవిష్యత్‌కు బాటలు వేయనున్నారు. ప్రపంచంలోనే ఇలాంటి విశ్వ విద్యాలయం ఒక అమెరికాలో మాత్రమే ఉండగా.. మన దేశంలో మాత్రం మొదటిది కావడం గమనార్హం. ఇక ఈ యూనివర్సిటీలో యూజీ (బీఎస్సీ) ప్రోగ్రాంలో జియాలజీ, ఎన్విరాల్‌మెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, పీజీ (ఎంఎస్‌సీ) ప్రోగ్రాంలో జియాలజీ, ఎన్విరాల్‌మెంటల్ సైన్స్, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, పీహెచ్‌డీ ప్రోగ్రాంలో యూజీసీ నిబంధనల ప్రకారం కోర్సులను అందించడంతో పాటు ఇప్పటికే బీటెక్ ప్రోగ్రాంలో ఉన్న మైనింగ్ ఇంజనీర్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల్లో ప్రతీ కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లతో విద్యను అందిస్తారు. ఈ వర్సిటీ మంజూరుతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వేలాది మంది విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతోపాటు శాస్త్రవేత్తలుగా తయారు చేసే అవకాశాలున్నాయి. ఎర్త్ సైన్స్ యూనివర్శిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలసీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం లాంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

దేశ స్థాయిలో పెరగనున్న ఖ్యాతి..

ఖనిజ సంపదతో పాటు అన్ని వనరులున్న భద్రాద్రి జిల్లాలో ఏర్పాటైన ఎర్త్ సైన్స్ విద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు

(మిగతా 7వ పేజీలో)

వర్సిటీ ఏర్పాటులో తుమ్మల కీలక భూమిక

సీఎంకు ధన్యవాదాలు చెప్పిన మంత్రి



మైనింగ్ కళాశాలను విశ్వ విద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయడం.. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మార్చడంలో మంత్రి తుమ్మల కీలక భూమిక పోషించారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నిరంతరం పనిచేసే నేతగా పేరున్న తుమ్మల.. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయంగా మార్చడంలో కీలక పాత్ర పోషించారు. ఇక ఈ యూనివర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు ఖరారు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం.. భద్రాద్రి జిల్లా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం కానుందని వ్యాఖ్యానించారు.

ఉద్యాన పంటలకు ఊతం

- రూ.48కోట్లతో 2025-26 వార్షిక ప్రణాళిక
- ఖమ్మం జిల్లాలో 227 హెక్టార్లలో పండ్ల తోటలకు రాయితీ లక్ష్యం
- ఆయిల్‌పామ్ టార్గెట్ 14,500 ఎకరాలు
- రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై పరికరాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

7

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జూన్ 17 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో చేరేందుకు 3వ, 5వ, 8వ తరగతుల ప్రవేశం కొరకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఖమ్మం జిల్లాకు చెందిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో అర్హులైన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు. 3వ తరగతి విద్యార్థులకు (29) 5వ తరగతికి (14), 8వ తరగతికి (14) సీట్లు కేటాయించినట్టు తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశ దరఖాస్తు గడువు జూన్ 17తో ముగుస్తుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ 20న పీవో అధ్యక్షతన ఐటీడీఏ ఆఫీసులో తరగతి వారీగా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

నిబంధనలు ఇలా...

ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష యాభై వేల లోపు ఉండాలన్నారు. దరఖాస్తుకు కుల, నివాస ధ్రువీకరణ పత్రం, గత రెండేళ్ల చదివిన పాఠశాల స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు జత చేయాలని, ఆసక్తి గలవారు జూన్ 17న సాయంత్రం ఐదు గంటలలోపు ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం, రూమ్‌నెం. ఎస్- 30, కలెక్టరేట్ ఖమ్మంలో దరఖాస్తులను అందించాలని ప్రకటనలో కోరారు.

నేటి నుంచి బడిబాట..

- విద్యార్థుల నమోదు పెంపుదలే లక్ష్యం
- ముందుగానే పాఠశాలలకు చేరిన పుస్తకాలు, ఏకరూప దుస్తులు

7



బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

సం'రక్షణ' కరువు!



- అభివృద్ధికి ఆమడదూరంలో భద్రాద్రి దేవస్థాన శ్రీగోకులరామం
- పురుషోత్తపట్నంలో 109 ఎకరాల్లో పలు నిర్మాణాలకు ప్రణాళికలు
- భూ ఆక్రమణలతో రెండు ఎకరాలకే పరిమితం
- రామయ్య భూముల ఆక్రమణలను పట్టించుకోని ఏపీ సర్కార్

భద్రాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో కోడెల మూగరోదన నేపథ్యంలో రాష్ట్రంలో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాలు నిర్వహించే గోశాలలను జాగ్రత్తగా ఉంచాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించి సరిహద్దున ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న శ్రీ గోకుల రామానికి సంపూర్ణ సంరక్షణ లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దేవస్థానం అధికారులు శ్రీగోకులరామంను అభివృద్ధి చేయాలని భావిస్తున్నా స్థానిక పరిస్థితులతో పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేకపోతున్నట్లు దేవస్థానం వర్గాలు చెబుతున్నాయి. భద్రాద్రి రామయ్యకు పురుషోత్తపట్నంలో 889.5 ఎకరాల భూమి ఉండగా దాదాపు ఈ భూమంతా ఆక్రమణలోనే ఉందని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి. ఈ విషయమై ఏపీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీ గోకుల రామం ప్రధాన ద్వారం

శ్రీగోకుల రామం.. రెండెకరాలకే పరిమితం

భద్రాద్రి రామయ్యకు ఉన్న భూముల్లో శ్రీగోకులరామం నిర్మాణం చేపట్టాలని భద్రాద్రి దేవస్థానం గతంలోనే నిర్ణయించింది. 2018లో ఇందుకు శ్రీకారం చుట్టారు. 109ఎకరాల్లో గోశాల నిర్మాణం, పుష్పవనం, తులసివనం, చెరువు నిర్మాణం ఇతరత్రా వాటికి ఈ భూమిని వినియోగించాలని ప్రణాళికలు రూపొందించారు. అయితే స్థానిక పరిస్థితుల నేపథ్యంలో గోకులరామంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సైతం దేవస్థానం అధికారులు వెనుకాడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం కేవలం రెండు ఎకరాల్లోపే శ్రీగోకుల రామంలో గోశాల నిర్మాణం చేశారు. ప్రస్తుతం రెండు షెడ్లు ఉండగా ఇందులో 68 ఆవులు, లేగదూడలు ఉన్నాయి. ఆవులకు పచ్చిగ్రాసం పెంచేందుకు సైతం దేవస్థానం అధికారులు చేసిన ప్రయత్నాలకు ఆక్రమణదారులు అడ్డు తగులుతున్నారని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీంతో శ్రీగోకుల రామానికి పేరుకు 109ఎకరాలు కేటాయించినా కేవలం రెండు ఎకరాల్లోనే అంతా నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వాటికి అదనంగా మరో రూ.40 లక్షలతో రెండు షెడ్ల నిర్మాణం దాతల సహకారంతో దేవస్థానం చేపడుతోంది. ఇది పూర్తయితే గోవుల సంరక్షణకు మరింత వెసులుబాటు లభిస్తుందని దేవస్థానం అధికారులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా గోశాల నిర్వహణకు భద్రాద్రి దేవస్థానం నెలకు రూ.3లక్షలు ఖర్చు చేస్తోంది. దీంతో దాణా, తవుడు, మినపపొట్టు, వరిపొట్టు, బలపాలు తదితర వాటిని కొనుగోలు చేసి ఆవులకు అందిస్తున్నారు. ఇందులో మొత్తం ఏడుగురు సిబ్బంది పని చేస్తుండగా వారికి వేతనాలుగా రూ.72వేలు చెల్లిస్తున్నారు. ఆవుల ద్వారా ప్రతిరోజు 25 లీటర్ల పాలు లభిస్తుండగా వాటిని భద్రాద్రి రామాలయం, అనుబంధ ఆలయాల్లో పూజలకు, దేవస్థానం ఉచిత నిత్యన్నదాన సత్రం అవసరాలకు వినియోగిస్తున్నారు. కాగా గోవులకు సైతం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫ్యాన్లు, ఫాగర్స్ ఏర్పాటు చేశారు. క్రమం తప్పకుండా గోవులకు పశువైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏపీలో రామయ్య భూముల ఆక్రమణలతో సమస్యలు

భద్రాద్రి రామాలయం తెలంగాణలో ఉండటం, రామయ్య భూములు అధిక శాతం ఆంధ్రాలో ఉండటంతో పరిపాలనాపరంగా సాంకేతిక అవరోధాలు తలెత్తుతున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. భద్రాచలానికి కూతవేటు దూరంలో ఉన్న పురుషోత్తపట్నంలో దేవస్థానానికి 889.5ఎకరాల భూములున్నా అవన్నీ ఆక్రమణలోనే ఉండటంతో దేవస్థానం అభివృద్ధి పనులు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఆక్రమణలపై గత ఐదేళ్లలో సుమారు 45సార్లు పోలీసులకు, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీంతో శ్రీగోకుల రామం నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టలేకపోతున్నారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు భద్రాద్రి దేవస్థాన భూ సమస్యలపై ప్రత్యేకంగా సమీక్షించి పరిష్కారం చూపితేనే శ్రీగోకుల రామంలో దేవస్థానం అధికారులు ఆశించిన గోశాల, పుష్పవనం, తులసివనాల నిర్వహణ సాధ్యమవుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. రెండు ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఖమ్మంలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ కింద పడి తండ్రీకొడుకులు దుర్మరణం
- కుమారుడు కళాశాల ఫీజు చెల్లించేందుకు వచ్చిన క్రమంలో ఘటన
- మృతులు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ వాసులు



బాల్య (ఫైల్)



సాయికృష్ణ (ఫైల్)

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కుమారుడి కళాశాల ఫీజు చెల్లించేందుకని ద్విచక్రవాహనంపై ఖమ్మం వచ్చిన ఆ తండ్రీ, కుమారుడు ఘోర రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బురుగుపాడు దుబ్బ తండాకు చెందిన అజ్మీరా బాల్య (45) కుమారుడు సాయికృష్ణ (17) నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు. ఈ క్రమంలో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి కళాశాల ఫీజు చెల్లించేందుకు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై గురువారం ఉదయం ఖమ్మం వచ్చారు. నగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద మూలమలుపు తిరుగుతున్న క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటెయినర్ లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడగా.. వారిపైనుంచి లారీ ముందు చక్రం వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆ సమయంలో ట్రాఫిక్ బారీగా నిలిచిపోవడంతో పోలీసులు వెంటనే మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాల్య బార్య భారతీ దుబ్బతండా మాజీ సర్పంచ్.. కాగా వీరికి ఒకే ఒక్క కుమారుడు. రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతి చెందారన్న వార్త తెలుసుకున్న గ్రామస్థులు అధిక సంఖ్యలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో భార్య, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రోదనలు అక్కడి వారిని కంటి తడిపెట్టించాయి. ఈ ఘటనపై బాల్య బంధువు జల్‌రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఖమ్మం రెండో పట్టణ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మృతదేహాలను అన్నం ఫౌండేషన్ ఛైర్మన్, సామాజిక కార్యకర్త అన్నం శ్రీనివాసరావు మృతదేహాలను తన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి స్వగ్రామానికి తరలించారు. అయితే సర్కిల్‌లో రెడ్‌సిగ్నల్ పడినప్పటికీ లారీ వేగంగా దూసుకురావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం.

అడవులు నరికే వారిపై చర్యలు తీసుకోండి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్



మొక్క నాటుతున్న కలెక్టర్

7

సింగరేణి మెడికల్ బోర్డు అవకతవకలపై ఏసీబీ ఫోకస్

- అక్రమాలకు పాల్పడుతున్న ఓ మహిళ అరెస్టు

ప్రతీ సమస్యను పరిష్కరించండి

» అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలు
» 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన
» హలో కమిషనర్ కార్యక్రమానికి వెల్లువెత్తిన కాల్స్



నగరంలోని సమస్యలపై గురువారం 'హలో కమిషనర్' పేరుతో 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఫోన్ కాల్స్ ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యల పట్ల కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందిస్తూ.. సమస్యకు అనుగుణంగా చర్యలు చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యధికంగా దృష్టికొచ్చిన సమస్యలను గుర్తించి.. స్పెషల్ డ్రైవ్ పెట్టేలా, సంబంధిత శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

- ఖమ్మం, ఆంధ్రజ్యోతి

● గతంలో రూ.2,500 ఇంటి పన్ను ఉండేది. కానీ ప్రస్తుతం రూ.7వేలు వచ్చింది.

- మిట్టపల్లి వెంకటేశ్వర్లు, కవిరాజ్ నగర్

కమిషనర్: ఏప్రిల్ 30 వరకు సిబ్బంది కలెక్షన్లలో బిజీగా ఉండటం వలన ఆలస్యం జరిగింది. నేను సంబంధిత ఆర్ఐ, బిల్ కలెక్టర్ ద్వారా ఇంటి పన్నును వెరిఫై చేయమని చెప్తా.

● వాసిరెడ్డి ఫంక్షన్ హాలు దగ్గర రోడ్ల ఆక్రమణ జరుగుతోంది. వాహనాల పార్కింగ్ కోసం రోడ్డుపై రేకులు వేయడం వల్ల ఇబ్బందిగా ఉంది.

- పూసపాటి బాబు, ఖమ్మం

కమిషనర్: టౌన్ ప్లానింగ్ వారికి చెప్తాం. వారు వచ్చి సమస్యను పరిష్కరిస్తారు.

● రోడ్డుకు అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదు.

వెంకటరమణ, 48వ డివిజన్

కమిషనర్: సాయంత్రంలోపు ఆ ఫ్లెక్సీలు తొలగిస్తాం.

● రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు బాగా ఉన్నాయి. ఖాళీ ప్లాట్లలో చెత్త పేరుకుపోయింది. డ్రెయినేజీల సమస్య తీవ్రంగా ఉంది.

- ప్రసాదరావు, జయనగర్ కాలనీ 7వ లైన్

కమిషనర్: రెండు రోజులు మూడో డివిజన్‌లో గ్యాంగ్ వర్క్ పెట్టి శుభ్రం చేయడం జరుగుతుంది. అలాగే ప్రతీ బుధ, గురు వారాల్లో డివిజన్లు శుభ్రం చేసేందుకు డ్రైవ్ పెడుతున్నాం

● మున్సిపల్ బిల్డింగ్ పక్కన అప్రోచ్ రోడ్డు సమస్య ఉంది. సర్వే పూర్తయింది. సర్వేకు ఏసీపీ హాజరయ్యారు. ఎమ్మార్వో కార్యాలయంలో దానిని సబ్‌మిట్ చేయడం జరిగింది.

- సందీప్, ఖమ్మం

కమిషనర్: ఈ సమస్య నా నోటీసులో ఉంది. దీనికి సంబంధించి పలు డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉంది. మీరు సాయంత్రం కార్యాలయానికి వచ్చి నన్ను కలవండి.

● 16వ డివిజన్‌కు శ్మశానవాటిక లేదు. 15లోని శ్మశనవాటికకు రానివ్వడంలేదు.

- నెమలి కృష్ణారావు, 16వ డివిజన్

కమిషనర్: శ్మశాన వాటిక ఏర్పాటుకు సంబంధించి భూమిని గుర్తించాలి. కార్పొరేటర్‌తో మాట్లాడి కౌన్సిల్ అజెండాలో పెట్టమని చెప్పండి.

● రోడ్డు సగానికి పైగా మొక్కలు వేసి రోడ్డును ఆక్రమించారు. మా రోడ్డుకు డ్రెయినేజీ కూడా లేదు పరిష్కరించగలరు. మున్సిపల్ ట్యాక్స్ లో పేరు తప్పు ఉంది.

- లూర్థయ్య, విజయ్‌నగర్ కాలనీ

కమిషనర్: రోడ్ల ఆక్రమణకు సంబంధించి మా టౌన్ ప్లానింగ్ సిబ్బంది వచ్చి పరిశీలిస్తారు. డ్రెయినేజీకి మీ స్థానికులతో కలిసి సంతకాలు చేసి దరఖాస్తు ఇవ్వండి. ట్యాక్స్‌కు సంబంధించి దరఖాస్తు ఇచ్చారు.. దానిని త్వరితగతిన పరిష్కరిస్తాం.

● కైకొండాయిగూడెంలోని చర్చి ముందు రోడ్డును ప్లాటు అని ఆక్రమించుకున్నారు. రోడ్డుకు ఇబ్బంది అవుతుంది.

- కైకొండాయిగూడెం వాసి.

కమిషనర్: ఇది మా పరిశీలనలో ఉంది. టౌన్ ప్లానింగ్ వారు వచ్చి పరిశీలిస్తారు.

● చెత్త, డ్రెయిన్లు తీయడం లేదు. కాల్వలను పూడిక తీయడం లేదు. వీధి దీపాలు పోయినా పెట్టడం లేదు. కుక్కలు తిరుగుతున్నాయి. చిన్నపిల్లలున్నారు భయంగా, ఇబ్బందిగా ఉంది.

- కుమార్, 56వ డివిజన్

కమిషనర్: కాల్వలు, డ్రెయిన్లు పూడిక తీయిస్తాం. వీధి దీపాలకు సంబంధించి మా ఏఈ గారిని పంపించి ఎన్ని దీపాలు వెలగడంలేదో పరిశీలించి లైట్లు వేయిస్తాం.

● 53వ డివిజన్ బోడేపూడి స్తూపం దగ్గర హెచ్‌పీ గ్యాస్ గోదాం దగ్గర రోడ్లపైన లారీలు ఆపడం జరుగుతుంది. మూడు నెలల నుంచి ఒక లారీ అక్కడే పెట్టి ఉంచారు.

- నరసింహారావు, 43వ డివిజన్

కమిషనర్: మా అధికారులు వచ్చి మీ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారు.

● కాల్వ పక్కన డంపింగ్ యార్డులాగా చెత్త అంతా తీసుకొచ్చి వేస్తున్నారు. బాగా దుర్వాసన వస్తుంది. వాకర్స్ కూడా ఇబ్బంది పడుతున్నారు.

- ఆకారపు శ్రీనివాస్, 6వ డివిజన్

కమిషనర్ : మా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వచ్చి పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

● కవిరాజ్‌నగర్‌లోని రోడ్డు నెంబర్ 6లో కట్టకు ఆనుకుని ఉన్న డ్రెయినేజీ ఉంది. అక్కడ శుభ్రం చేయకపోవడం వల్ల రోడ్లపైకి నీళ్లు వస్తున్నాయి.

- కె. శ్రీధర్ రెడ్డి, 41 డివిజన్, కవిరాజ్ నగర్

కమిషనర్: రెండు మూడు రోజుల్లో శుభ్రం చేస్తాం. నగరం మొత్తం డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నాం. అక్కడ కూడా శుభ్రం చేయిస్తాం.

● మెయిన్ రోడ్డు నుంచి 200 మీటర్ల తర్వాత డ్రెయినేజ్ క్లోజ్ అయి ప్లాటులోకి నీళ్లు చేరి చెరువును తలపిస్తున్నాయి.

- మధు, రోడ్డు నెంబర్ 16 , శ్రీనగర్ కాలనీ,

కమిషనర్: కచ్చాకాల్వను తీయిస్తే కిందికి వెళ్లి పోతాయి. డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించి మా ఇంజనీరింగ్ అధికారులు కూడా వచ్చి పరిశీలిస్తారు.

● ఆర్యవైశ్య కాలనీలో చెత్త సేకరణ జరగడం లేదు. జవాన్‌కు చెబితే పంపిస్తా అని చెప్పారు. కానీ రాలేదు. మెయిన్ రోడ్డుపై చికెన్ వ్యర్థాలు వేస్తున్నారు. ఖాళీ ప్లాట్లలో చెట్లు పెరిగి ఇబ్బందిగా ఉంది. రోడ్లు సరిగ్గా లేని పరిస్థితి ఉంది.

- రామరాజు, 16వ డివిజన్

కమిషనర్: ఇది ధంసలాపురం దగ్గర వస్తుంది. మా శానిటేషన్ సిబ్బంది అక్కడకు వచ్చి పరిశీలిస్తారు. సంబంధిత అధికారులు వచ్చి పరిశీలిస్తారు.

● 58జీవోలో పట్టాలు ఇచ్చారు. 77 మంది ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్నాం. సర్వే పూర్తయింది కానీ ఇంటి నెంబరు కేటాయించలేదు. ఫ్రీడమ్ పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో ఏడు లైట్లు వెలగడం లేదు.

- అశోక్, ఎన్నెస్పీ క్యాంపు

కమిషనర్: మా అధికారులు సమస్యను పరిష్కరిస్తారు.

● 35వ డివిజన్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. మాది చాలా పేద కుటుంబం. ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చినా జీరో బిల్లు కూడా రావడంలేదు. ఆన్‌లైన్ కాని కారణంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంక్వైరీకి కూడా రాలేదు.

- కర్లపాటి శ్రీదేవి, 35వ డివిజన్

కమిషనర్: మీ దరఖాస్తు మా దగ్గర ఉంది. కొత్త దరఖాస్తుకు సంబంధించి ఆప్షన్లకు ప్రభుత్వం వెబ్‌సైట్‌కు అనుమతిచ్చిన వెంటనే మీ దరఖాస్తును ఆన్‌లైన్ చేస్తాం. ఇందిరమ్మ ఇంటికి సంబంధించి మా అధికారులు మీతో మాట్లాడతారు.

● కరుణగిరి దగ్గర బ్రిడ్జి పక్కన కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసన వస్తుంది.

- దేవులపల్లి ఉపేందర్, కరుణగిరి

కమిషనర్: మా పారిశుధ్య విభాగం వారు వచ్చి పరిశీలిస్తారు. తగిన చర్యలు తీసుకుంటారు.

● శ్రీనగర్ కాలనీలోని రోడ్డు నెంబర్ 4, 5లో రోడ్డుపైన షెడ్లు వేసి కార్లను పార్కింగ్ చేస్తున్నారు. ఇబ్బందిగా ఉంది.

- సాయినేని నాగేశ్వరరావు, శ్రీనగర్ కాలనీ

కమిషనర్: మా టౌన్ ప్లానింగ్ సిబ్బంది వచ్చి చర్యలు తీసుకుంటారు.

● మా ఇంటి ముందు ఖాళీ స్థలంలో డ్రెయినేజీ, రోడ్డు వేసినప్పుడు ఎక్కడో చెత్త తీసుకొచ్చి అక్కడ వేశారు. పదేళ్లుగా వీధి దీపం కూడా లేదు.

- ఓ మహిళ, ముస్తఫానగర్, శ్రీరాంనగర్ 1వ స్ట్రీట్

కమిషనర్: మా శానిటేషన్ వాళ్లు వచ్చి ఖాళీ స్థలాన్ని శుభ్రం చేస్తారు. వీధి దీపాలు కూడా ఏర్పాటు చేస్తాం.

● శ్రీశ్రీ సర్కిల్ దగ్గర రోడ్డును ఆక్రమించినప్పుడు కార్పొరేషన్ అధికారులు తొలగించారు. మళ్లీ వారు గోడ కట్టారు.

- నరసింహారావు, గట్టయ్యసెంటర్

కమిషనర్: ఈ సమస్య మాకు తెలుసు. ఇది పబ్లిక్ ప్రాబ్లం కాదు. దీని గురంచి మా టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడండి.

● రోడ్లను శుభ్రం చేయడంలేదు. చెత్త కుప్పలు పేరుకుని ఉన్నాయి. బిల్డింగులు కడుతున్నారు... అక్కడ ఇసుక రోడ్లపైకి వచ్చి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ వాటర్ పైపులైను లీకేజీ ఉండి నీళ్లు కాల్వలోకి వెళ్లిపోతున్నాయి.

- దామోదర్, మోహన్‌రోడ్డు

కమిషనర్: మీ సమస్యలను మేం నోట్ చేసుకున్నాము. మూడు సమస్యలనూ పరిష్కరిస్తాం.

● పోలీస్ హౌజింగ్ కాలనీలోకి వచ్చేటప్పుడు రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దగ్గరలో వైన్ షాపు ఉంది. అక్కడ నుంచి తెచ్చుకుని రోడ్లపైనే కూర్చుని తాగుతున్నారు. రోడ్లపైకి ఆడవారు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు.

- శ్రీనివాస్, పోలీస్ హౌజింగ్ కాలనీ

కమిషనర్: రోడ్ల ఆక్రమణ గురించి మా టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి పరిశీలించి చర్యలు తీసుకుంటారు. వైన్ షాప గురించి ఎక్సైజ్ శాఖకు తెలియపరుస్తాం.

● ఖానాపురంలోని కరెంటు ఆఫీసు ఎదురుగా ఉన్న రోడ్డులో రెండు నెలలుగా డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు.

- మురళి, ఖానాపురం, రోడ్డు నెం.4

కమిషనర్: డ్రెయిన్లు శుభ్రం చేయిస్తాం.

● ఇంటి ముందు వారు సర్వీస్ వైరును రోడ్డు మీద గ్రౌండ్ లెవెల్ నుంచి మా ఇంటి ముందు ఉన్న పోల్‌కు వేశారు. ఇటీవల ఓ వాహనదారుడు పోల్‌కు తగలడం వల్ల పోల్ విరిగిపోయి.. సర్వీస్ వైరు కూడా బ్రేక్ అయింది. సంబంధిత యజమానికి చెప్పినా పట్టించుకోవడంలేదు.

- కరుణ, చైతన్య నగర్, ఖమ్మం

కమిషనర్: మా ఇంజనీరింగ్ సెక్షన్ వారు మీకు ఫోన్ చేస్తారు. సమస్యను పరిష్కరిస్తాం.

● మ్యాన్‌హోల్ మూతలు క్లోజ్ చేసి ఉండేవి. పక్కన వారు దానికి సగంపైగా గోడను కట్టారు. అధికారులు సహాయం చేయాలని కోరుతున్నాను.

- సీహెచ్.మంగ, సుందరయ్య నగర్, పంపింగ్‌వెల్‌రోడ్డు

కమిషనర్: మా ఏఈ మీకు కాల్ చేస్తారు.

● మామిళ్లగూడెంలోని పాత ఎన్జీవో సెంటర్ ఫ్లెక్సీలు అడ్డంగా ఉన్న కారణంగా ఇబ్బంది అవుతుంది.

- మేడి పవన్‌కుమార్, 49వ డివిజన్

కమిషనర్: సాయంత్రంలోపు వాటిని తొలగిస్తాం.

● ఖమ్మం హెడ్ పోస్టాఫీసు ముందు ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. అక్కడ డబ్బా దుకాణాలు ఉండటం వల్ల సమస్య ఎక్కువగా ఉంది.

- చంద్రశేఖర్, ఖమ్మం

కమిషనర్: సమస్యను నోట్ చేసుకుంటున్నాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

● గాంధీ నగర్‌లోని కాస్రాల వీరభద్రం ఇంటి రోడ్డులో రోడ్డు ఆక్రమించి 30 అడుగులు రోడ్డు కాస్త 20 అడుగులుగా మార్చారు. ర్యాంపులు రోడ్లపైకి వేయడంతోపాటు, రోడ్లపైన పార్కింగ్ షెడ్లు వేస్తున్నారు.

- లక్ష్మీనారాయణ, 33వ డివిజన్.

కమిషనర్: సమస్యను నోట్ చేసుకుంటున్నాం. మా అధికారులు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటాం.

● త్రీటౌన్‌లో పొట్టి శ్రీరాములు, గాంధీచౌక్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంది.

- డి.శ్రీనివాసరావు, త్రీటౌన్ ఏరియా

కమిషనర్: మా టౌన్ ప్లానింగ్ వారు వచ్చి పరిశీలిస్తారు.

● రామచంద్రయ్య నగర్‌లోని పార్కు వెనుక రోడ్డు పందులకు నిలయంగా మారింది. ఖాళీ స్థలంలో నీళ్లు నిలిచి దోమలకు విజృంభిస్తున్నాయి.

- చెరుకూరి హనుమంతురావు, రామచంద్రయ్య నగర్, 21వ డివిజన్

కమిషనర్ : పందుల సమస్యకు కొంత సమయం పడుతుంది. ఏజెన్సీతో మాట్లాడుతున్నాం. మురుగు సమస్యను మా శానిటేషన్ వాళ్లు వచ్చి పరిష్కరిస్తారు.

● ఓ బిల్డింగ్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి మెటీరియల్ మొత్తం రోడ్డుపై వేస్తున్నారు. వారు 17ఏళ్లుగా హౌజ్, వాటర్ ట్యాక్స్ కట్టడం లేదు.

- దుర్గాప్రసాద్, 17వ డివిజన్

కమిషనర్ : మా శానిటేషన్ సిబ్బంది వచ్చి పరిశీలిస్తారు. హౌజ్, వాటర్ ట్యాక్స్ అంశాన్ని పరిశీలిస్తాం.

● బెస్త కాలనీ రోడ్డు కబ్జా చేసి కాల్వలకు సంబంధించి నీళ్లు పోనివ్వకుండా చేశారు. 500 ఇళ్లకు సంబంధించిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కాకతీయ స్కూల్ వెనుకభాగంలో లైటు లేక పిల్లలకు ఇబ్బందవుతుంది. వాటర్ లైను కోసం పైపులు కూడా వచ్చాయి. వీలైనంత త్వరగా పరిష్కరించగలరు.

- ధనాల వెంకటరమణ, 17వ డివిజన్

కమిషనర్ : మా టౌన్ ప్లానింగ్ సిబ్బంది వస్తారు. వీధి లైట్లు కూడా ఏర్పాటు చేయిస్తాం. మా ఇంజనీరింగ్ అధికారులు కాల్ చేస్తారు. వారికి వివరాలు తెలపండి.

● కెఆర్ఆర్ ఫంక్షన్ హాలు దగ్గర విద్యుత్ దీపం వెలగడంలేదు.

- కాశయ్య, బల్లేపల్లి

కమిషనర్: వీధిలైటు మారుస్తాం.

● రాపర్తినగర్‌లో అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశాను. కానీ యేడాదిలోపే కురుస్తుంది.

- లక్ష్మణ్, రాపర్తినగర్.

కమిషనర్: మా అధికారులు సంబంధిత బిల్డర్‌తో మాట్లడతారు.

● బల్లేపల్లి ఎస్ఎఫ్ఎస్ వెనుక భాగంలో వీధిలైట్లు వెలగడం లేదు. నడవడానికి కూడా దారిలేదు. వర్షాకాలంలో ఇబ్బంది అవుతుంది.

- యేసు, బల్లేపల్లి

కమిషనర్: లైట్లు వేయిస్తాం. మీ స్థానికులతో మాట్లాడి దరఖాస్తు చేయండి. రోడ్డు శాంక్షన్ చేస్తాం.

● రాపర్తినగర్‌లో బీసీ కాలనీకి సెంట్రల్ లైటింగ్ వేసి సైడ్ డ్రెయిన్లు తీశారు. రోడ్లు ఊడ్చినప్పుడు ఆ చెత్తను డ్రెయిన్లలో వేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు ఇబ్బంది అవుతుంది. పకృతివనంలో చెట్లు పెరిగి పాములు వస్తున్నాయి.

- పుల్లయ్య, రాపర్తినగర్

కమిషనర్: మా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కాల్ చేస్తారు. పకృతివనం కూడా శుభ్రం చేయిస్తాం.

● గోర్కే పబ్లిక్ స్కూల్ దగ్గర డ్రెయినేజీ లేదు. వర్షం పడినప్పుడు ఇబ్బందవుతుంది. దరఖాస్తు కూడా చేశాం.

- రాజారాం, గట్టయ్యసెంటర్

కమిషనర్: దానిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

● ఖాళీ ప్లాటులో చిన్నపాటి వర్షానికే నీళ్లు నిలిచిపోతున్నాయి.

- దోలి. నర్సయ్య, జయనగర్ కాలనీ, 28వ లైన్, మూడో డివిజన్

కమిషనర్: మా శానిటేషన్ వాళ్లు సంబంధిత యజమానితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారు.

● యూనియన్ బ్యాంకు దగ్గర కాల్వ పూడిక తీయడంలేదు. చెట్లు పెరిగి ఇబ్బందిగా ఉంది.

- బోయపాటి అప్పారావు, 4వ డివిజన్.

కమిషనర్: మా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరిస్తారు.

● మా కాలనీ ఐదారేళ్ల క్రితం ఏర్పాటయ్యింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. మొత్తం మట్టి రోడ్లు. చిన్నపాటి వర్షం వస్తే చాలు బురదమయంగా మారుతుంది.

- రాజేష్, కైకొండాయిగూడెం, రైల్వే కాలనీ

కమిషనర్: మా ఏఈ వచ్చి పరిశీలిస్తారు. మీ డివిజన్‌లో రోడ్లు శాంక్షన్ అయ్యాయో లేదో పరిశీలించి శాంక్షన్ చేస్తాం.

ఫోన్ ఇన్‌లో చెప్పినట్టుగానే.. చేసి చూపించారు

ఖమ్మం, జూన్5 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' గురువారం హలో కమిషనర్ పేరుతో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించిన కార్పొరేషన్ కమిషనర్. ఓ ఫిర్యాదుదారుడు చెప్పిన సమస్యకు వెంటనే స్పందించారు. సాయంత్రం కల్లా సమస్యను పరిష్కరిస్తామని ఆ వ్యక్తికి చెప్పినట్టుగానే చేసి చూపించారు. 48వ డివిజన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా పట్టించుకోవడం లేదని, మామిళ్లగూడెంలోని పాత ఎన్జీవో సెంటర్‌లో రోడ్డుకు ఫ్లెక్సీలు అడ్డంగా ఉన్నాయంటూ ఇద్దరు వ్యక్తులు తమ సమస్యలను వివరించారు. ఆ సమయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య సాయంత్రంలోపు ఆ ఫ్లెక్సీలను తొలగిస్తామని వారికి చెప్పారు. ఆ తర్వాత ఫ్లెక్సీల తొలగించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేయగా.. ఆ రెండు ప్రాంతాల్లోని ఫ్లెక్సీలను అధికారులు.. సిబ్బందితో మధ్యాహ్నానికే తొలగింపజేశారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

జూలూరుపాడు, జూన్5(ఆంధ్రజ్యోతి): భార్య మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన మండలంలోని రాంచంద్రాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కల్తి వెంకటేశ్వర్లు(40) కొంతకాలంగా మద్యానికి బానిసై నిత్యం డబ్బులు కావాలంటూ భార్య మహాలక్ష్మితో తరుచూ ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో భార్య మన ఆర్థిక పరిస్థితి సరిగా లేదని, మద్యం తాగవద్దు అంటూ నచ్చ చెప్పేది. డబ్బులు ఇవ్వకపోతే పురుగుల మందు సేవించి చనిపోతానని పలుమార్లు బెదిరించాడు. ఈ క్రమంలో మే 31న రాత్రి 7 గంటల సమయంలో భార్య వద్దకు వెళ్లి మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని వివాదానికి దిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో బయటికి వెళ్లి గంట తరువాత వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చి నేను పురుగు మందు తాగానని ఆమెతో చెప్పాడు. వెంటనే అతడిని వైద్య చికిత్సలు అందించేందుకు బంధువుల సహాయంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు...

అశ్వారావుపేట రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అశ్వారావుపేట మండలంలో గురువారం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన వీర్నాల సత్యనారాయణ(27)కు ఆంధ్రాలోని అల్లూరి జిల్లా వీఆర్‌పురం మండలం శ్రీరామగిరికి చెందిన సత్యావతితో పదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటినుంచి వారు అక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుని జీవించేవారు. ఏడాది క్రితం స్వగ్రామమైన ఆసుపాక వచ్చి నూతనంగా ఇంటిని నిర్మించుకున్నారు. దీంతో కొంతమేర ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆరునెలల క్రితం పనుల నిమిత్తం రాజమండ్రి వెళ్లి నెల రోజుల క్రితం తిరిగి వచ్చాడు.



సత్యనారాయణ మృతదేహం

ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మనస్థాపానికి గురైన అతడు బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. కాగా మండలంలోని పెదవాగుప్రాజెక్టు కట్ట మీద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సత్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

మద్యం మత్తులో ..

దుమ్ముగూడెం జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగువాయిబాడవ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి కల్లూరి కృష్ణ(55) గత నెల 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భద్రాచలం, ఆ తర్వాత కొత్తగూడెం ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని భార్య 18 ఏళ్ల క్రితం మృతి చెందింది. మృతుడికి కుమారుడు ఉన్నాడు. హెచ్‌సీ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

కారు పల్టీ: ఒకరి దుర్మరణం

కూసుమంచి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద కారు పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో కారు నడుపుతున్న కొత్తగూడెం పట్టణం బూడిదగడ్డ బస్తీకి చెందిన మహమ్మద్ ఇబ్రహీం (25) దుర్మరణం చెందాడు. ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు డోరు ఊడిపోవడంతో రోడ్డుపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే హైవే సిబ్బంది మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కూసుమంచి ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను ఢీకొన్న ఘటనలో మరొకరు...

ముదిగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గేదెను ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన చిలుమళ్ల గోవిందాచారి(52) ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి కోదాడ వైపు వెళ్తుండగా ముది గొం డ వద్ద ఖమ్మం-కోదాడ రహదారిపై గేదె అడ్డుగా రావడంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

14 మందికి జరిమానా

కొత్తగూడెం లీగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కోర్టులో 14మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు తీర్పుచెప్పారు. కొత్తగూ డెం వన్‌టౌన్ ఎస్ఐలు విజయ, తుంగ రాకేష్‌లు చేపట్టిన వాహనాల తనిఖీలో ఇరువురు మద్యం సేవించినట్లు రుజువు కాగా, వారిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి వారికి జరిమానా విధించారు. అదేవిధంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పర్యవేక్షణలో చేపట్టిన వాహన తనిఖీలో మద్యం సేవించి పట్టుబడిన 12 మందికి కోర్టు జరిమానా విధించినట్లు వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, జూన్5(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ (ఐటీఐ) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రుద్రంపూర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ మైనార్టీ ఐటీఐలలో ఆధునిక సాంకేతిక కేంద్రాలలో (ఏటీసీ) ఆగస్టు 2025 సెషన్‌కు కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8 లేదా 10వ తరగతి ఉత్తీర్ణులై 2025 ఆగస్టు 1 నా టికి 14 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

- రూ.48కోట్లతో 2025-26 వార్షిక ప్రణాళిక
- ఖమ్మం జిల్లాలో 227 హెక్టార్లలో పండ్ల తోటలకు రాయితీ లక్ష్యం
- ఆయిల్‌పామ్ టార్గెట్ 14,500 ఎకరాలు
- రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై పరికరాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఖమ్మం వ్యవసాయం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో వర్షాలు, సారవంతమైన భూములు, నాణ్యమైన విత్తనాలు, సకాలంలో సస్యరక్షణ చర్యలు.. ఇలా భూమిలో విత్తనం పడిన నాటినుంచి పంట చేతికందేవరకు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. అయినా అన్నదాతలకు వ్యవసాయంలో లాభాల కంటే నష్టాలే అధికంగా మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నాయి. తేలికపాటి భూముల్లో పండ్ల తోటల సాగుతో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.దీంతో ఉద్యానశాఖ అధికారులు జిల్లా రైతులకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తూ జిల్లావ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుకు చర్యలు చేపట్టారు.

ప్రత్యేక రాయితీలు, పరికరాలు

పండ్ల తోటల సాగులో నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. కొన్నిరకాల తోటలు వర్షాధారంగానే దిగుబడిని అందిస్తాయి.మిగిలిన తోటల్లోనూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ ఉత్పాదకతను సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. బిందు, సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తోంది. తెలంగాణ సూక్ష్మ సేద్య పథకం (టీజీఎంఐపీ) పథకం ద్వారా ప్రభుత్వం పండ్ల తోటలు సాగుచేసే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీ చిన్న సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీ, ఓసీ, ఇతర వర్గాలకు చెందినవారికి 80శాతం సబ్సిడీపై బిందుసేద్యం పరికరాలను అందిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో వంద ఎకరాల్లో ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం 1,710 ఎకరాల్లో తుంపర సేద్యం పరికరాలను అందించాలని లక్ష్యం నిర్దేశించింది. అయితే తుంపర సేద్యం పరికరాలను అన్నివర్గాల రైతులకు 75శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోంది.

తీగజాతి కూరగాయల సాగుకు..

పండ్ల తోటలతోపాటు కూరగాయల సాగులోనూ రైతులకు మంచి లాభాలుంటాయి. కూరగాయల సాగుకు నీటి వనరులు ఎంతో ముఖ్యం. అందుబాటులో నీటి సౌకర్యం ఉన్న రైతులు కూరగాయల సాగుపై దృష్టి పెట్టేందుకు శాశ్వత పందిర్లను ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలో 227 హెక్టార్లలో వివిధ రకాల తోటల పెంపకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. డ్రాగన్ ఫ్రూట్, అరటి, అంజీర, అవకాడో, బొప్పాయి, ఉసిరి, మామిడి, నిమ్మ ఉసిరి, మామిడి, హైబ్రీడ్ కూరగాయలు, పూలతోటలకు రాయితీ ఇవ్వనున్నారు. శాశ్వత పందిరిలో ఏర్పాటు నిర్మాణం కోసం రూ.25లక్షల ఆర్థిక కేటాయింపుతో 50యూనిట్లను లక్ష్యంగా నిర్ణయించారు. ముదురు మామిడి తోటల పునరుద్ధరణకు 13 హెక్టార్లు, మల్చింగ్ షీట్ వేసుకున్నందుకు 540 హెక్టార్లు, ప్యాక్ హౌజ్‌లకు 2 యూనిట్లు, ఉద్యాన యాంత్రీకరణకు 63 యూనిట్లు, ఫ్రూట్ కవర్లకు 25యూనిట్లు, వీడ్ మ్యాట్‌కు 20వేల స్క్వేర్ మీటర్ల లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. వెదురు సాగుకు జిల్లాలో 50ఎకరాల్లో రూ.7.20లక్షల ఆర్థిక లక్ష్యం నిర్ణయించారు.



ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహకాలు

కొత్త తోటల ఏర్పాటు ద్వారా జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు జిల్లా ఉద్యానశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. తోటల పెంపకంతో కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నారు. తోట ఏర్పాటు చేసుకున్న సంవత్సరం నుంచి మూడేళ్ల వరకు రాయితీని తోటల సంరక్షణ కోసం ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోనే జమచేస్తోంది. ఇక ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతుకు ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తోంది. అందు లో రూ2,100పంట సంరక్షణకు, మిగిలిన రూ.2,100 అంతర పంటల సాగు కోసం వినియోగించాల్సి ఉంటుంది. జిల్లాలో ఈ సంవత్సరం 14,500ఎకరాల్లో నూతనంగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాంగా రెండు అయిల్ కంపెనీలు అయిన ఆయిల్‌ఫెడ్, గోద్రెజ్ కంపెనీలు మొక్కలను అందిస్తున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఎంవీ మధుసూదన్,
జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి

పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తేలికపాటి భూముల్లోనూ పండ్ల తోటలు ఏర్పాటు చేసుకుని లాభాలు సాధించవచ్చు. ఒక్కసారి తోట ఏర్పాటు చేస్తే దీర్ఘకాలికంగా ఫలాలు పొందే అవకాశం ఉంది. రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై బిందు, తుంపరసేద్యం పరికరాలు అందిస్తోంది.

నేటినుంచి బడిబాట..

- విద్యార్థుల నమోదు పెంపుదలే లక్ష్యం
- ముందుగానే పాఠశాలలకు చేరిన పుస్తకాలు, ఏకరూప దుస్తులు

కొత్తగూడెం అర్బన్/బోనకల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రతి సంవత్సరం విద్యాశాఖ బడిబాట నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుండటంతో విద్యాశాఖ తిరిగి ప్రభుత్వ విద్యను గాడిలో పెట్టి పిల్లల పెంపుదలే లక్ష్యంగా తగు కార్యాచరణను రూపొందించింది. బడిబాటలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, ఉచితంగా అందించే అంశాలు, బోధనా తీరును విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించనున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో నేటి నుంచి జూన్ 6 నుంచి 19వ తేదీవరకు బడిబాట నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డీఈవోలను బడిబాటను విజయవంతం చేయాలని ఆదేశించింది. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి బడిబాట కార్యక్రమం షెడ్యూల్‌తో పాటు మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానున్న జూన్ 12న పాఠశాలలను సుందరంగా అలకరించాలని సూచించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ పండుగ వాతావరణంలో తల్లిదండ్రులకు, గ్రామస్థులకు స్వాగతం పలకాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ పెరెంట్, టీచర్స్ సమావేశాలు (పీటీఎం) నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. జిల్లాలో డీఈవో యం.వెంకటేశ్వరచారి మండల విద్యాశాఖ అధికారులు, అధ్యాపకులను బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు.

గతానికి భిన్నంగా ఈ ఏడాది పాఠశాలలకు ముందుగానే పాఠ్యపుస్తకాలతోపాటు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. బడులు తెరిచిన తొలిరోజున పిల్లలకు అందించేందుకుగానూ ఉపాధ్యాయులు ఇప్పటికే పుస్తకాలు, దుస్తులను బడులకు తరలించారు.

చేపట్టాల్సిన కార్యక్రమాలు ఇవే...

జూన్ 6న: ప్రత్యేక అధికారులు, ఊరి పెద్దలు, తాజ, మాజీ ప్రజాప్రతినిధులు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించి గ్రామస్థులకు ప్రభుత్వ పాఠశాలల బోధన తీరు తెన్నులను వివరించాలి.

7న : ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి బడి ఈడు పిల్లలను గుర్తించాలి.

8 నుంచి 10 తేదీల్లో: కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించాలి. డ్రాపవుట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి భవితకేంద్రాల్లో ప్రవేశాలు కల్పించాలి.

11న : 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షించుకోవాలి.

12న: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులతో ప్రారంభించాలి. అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు (యూనిఫామ్‌లు) అందజేయాలి.

13న: ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులను ఆహ్వానించి వారి సమక్షంలో సాముహిక అక్షరాభ్యాసం, బాలల సభలను నిర్వహించాలి.

16న : ఫౌండేషన్ లిటరీస్ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిపి) ఎల్ఐపీ దినోత్సవాన్ని నిర్వహించాలి. అన్ని తరగతి గదుల్లో సబ్జెక్టుల వారీగా అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలి. పిల్లలు రూపొందించిన వివిధ చార్టులతో గదులను అలకరించాలి. చదవటం, గణిత సంబంధిత అంశాలపై ఎఫ్ఎల్ఎన్ క్విజ్ పోటీలు నిర్వహించాలి.

17న : సమీకృత విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. బాలికా వివాహాలు, చిన్నారులపై వేదింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలి.

18న : తల్లిదండ్రులు, గ్రామస్థులను ఆహ్వానించి తరగతి గదులను డిజిటలీకరణపై ఇతర ఆధునిక సౌకర్యాలపై అవగాహన కల్పించి చూపించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు తెలియజేయాలి.

జూన్ 19న: బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలి.

మణుగూరు ఆర్టీసీ డ్రైవర్‌కు రివార్డ్

అందజేసిన ఎండీ సజ్జనార్



డ్రైవర్ మహేష్‌కు రివార్డు అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

అశ్వాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మణుగూరు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇల్లటూరి మహేష్ నిజాయతీకి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గురువారం రివార్డును అందజేశారు. మహేష్ గత నెల 28న విధి నిర్వహణలో అమలాపురం నుంచి మణుగూరు వస్తుండగా.. అశ్వారావుపేటకు చెందిన ఓ ప్రయాణికుడు రూ.లక్ష నగదు ఉన్న పర్సును బస్సులో పోగొట్టుకున్నాడు. అది గమనించిన డ్రైవర్ మహేష్ ఆ పర్సును మణుగూరు డిపో సెక్యూరిటీ అధికారులకు అందజేయటమేకాక, అనంతరం మణుగూరు వచ్చిన ప్రయాణికుడికి స్వయంగా నగదు పర్సును అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. మహేష్ నిజాయితీని గుర్తించిన అధికారులు రాష్ట్ర ఆర్టీసీ సేవా రివార్డు ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆర్టీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎండీ సజ్జనార్ చేతులమీదుగా రివార్డ్‌ను మహేష్ అందుకున్నాడు.

సింగరేణి మెడికల్ బోర్డు అవకతవకలపై ఏసీబీ ఫోకస్

అక్రమాలకు పాల్పడుతున్న ఓ మహిళ అరెస్టు

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి బోర్డులో జరిగిన అవకతవకలపై ఏసీబీ విచారణ వేగవంతం చేసింది. గతంలో మెడికల్‌బోర్డులో పైరవీలు చేస్తామంటూ పలువురి వద్ద డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన కడాలి చైతన్య అనే మహిళను ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో గురువారం అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంలోని సింగరేణి వర్క్‌షాపునకు చెందిన రాజేశ్వరరావును ఇదే కేసులో గతంలో ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.. ఈ క్రమంలో ఏసీబీ తన విచారణను మరింత వేగవంతం చేసింది. దీంతో రుద్రంపూర్ ఏరియాలో సింగరేణి పైరవీలు చేస్తున్నారనే ఆరోపణపై చైతన్య అనే మహిళను అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. మహిళ బ్యాంకు లావాదేవీలు, ఫోన్‌కాల్స్ డేటా తదితర అంశాలపై విచారణ జరిపినట్లు తెలిపారు. గతంలో అరెస్టు చేసిన రాజేశ్వరరావును ఇటీవల ఏసీబీ అధికారులు కోర్టు అనుమతితో మళ్లీ కస్టడీలోకి తీసుకుని విచారించడంతో మరిన్ని విషయాలు వెలుగు చూశాయి. దీంతో ఆ దర్యాప్తులో భాగంగా రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన మహిళను అరెస్టు చేయడంతో పైరవీకారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇదిలా ఉండగా మహిళ సమీప బంధువు సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు కార్యాలయంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకు ప్రాచ్య విద్యాభూషణం బిరుదు

ప్రకటించిన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం

భద్రాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రాచ్య విద్యాభూషణం బిరుదును ప్రకటించారు. ఈమేరకు అధికారికంగా ఇందుకు సంబంధించిన సమాచారం అందింది. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉత్కర్ష మహోత్సవం మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహిస్తున్న క్రమంలో సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకు ప్రాచ్య విద్యాభూషణం బిరుదు అందజేయనున్నారు. సంస్కృత పండితులుగా గత ఐదు దశాబ్దాల్లో వేలాది మందికి సంస్కృత విద్యను శ్రీమన్నారాయణాచార్యులు బోధించారు. శ్రీమన్నారాయణాచార్యులకు ప్రాచ్య విద్యాభూషణం బిరుదును జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రకటించడం పట్ల పలువురు ప్రముఖులు ఆయన శిష్య బృందం హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

అడవులు నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోండి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్



మొక్కను నాటుతున్న కలెక్టర్ జితేష్‌వీ పాటిల్

పాల్వంచ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అడవులు నరికే వారిపై కఠిన వైఖరి అవలంబించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పాల్వంచ అటవీ డివిజన్ పరిధిలోని నందనవనం అర్బన్ పార్కులో ప్రపంచ పర్యవరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్‌తో కలిసి పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవులు నరికే వారు ఎంతటి వారైనా చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మాదిరిగా అడవులను నరుక్కుంటూ పోతే స్థానిక గిరిజనులకు నష్టం జరుగుతుందని, భవిష్యత్‌లో వారికి ఎలాంటి ఫలసాయం అందుబాటులో ఉండదని అన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులు వారి పోడు భూముల్లో ఎక్కువ లాభాలిచ్చే వెదురు, కరక, తునికి, ఇప్ప జాతుల మొక్కలను పెంచి ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. పర్యవరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్వంచ డివిజన్ అటవీ అధికారి కట్టా దామోదర్‌రెడ్డి, రేంజ్ అధికారులు సురేష్, రవికిరణ్, కరుణాకరాచారి, డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతిని రక్షిద్దాం: జిల్లా ప్రధాన న్యాయాధికారి పాటిల్ వసంత్



ర్యాలీని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి పాటిల్ వసంత్

కొత్తగూడెం లీగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిని రక్షించి, భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామని జిల్లా ప్రధాన న్యాయాధికారి పాటిల్ వసంత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటి అనంతరం ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని సంరక్షించడమే నేటి తరానికి గొప్ప బాధ్యత పేర్కొన్నారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ ద్వార భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందంచవచ్చని ఆయన అన్నారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే ప్రకృతిని కాపాడుకోవాలని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. పర్యావరణంపై శ్రద్ధ చూపడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకార్యదర్శి ఎం. రాజేందర్ అన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణం నుంచి పోస్టాఫీస్ సెంటరు వరకు పర్యావరణ దినోత్సవ ర్యాలీను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే నినాదాలు, ఫ్లెక్సీలు ప్రదర్శించబడ్డాయి. ఈ ర్యాలీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కే. కవిత, రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి రవికుమార్, స్పెషల్‌సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కోటేశ్వరరావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జే. గోపీకృష్ణ, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, మోహన్‌రావు దాస్, జే. కిరణ్‌కుమార్, కోర్టు సిబ్బంది రాంశెట్టి రమేష్, మీనాకుమారి, నాజర్ మల్లిఖార్జున్, లగడపాటి సురేష్, దికొండ రవికుమార్, రామకృష్ణ, సిస్టప్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

11ఏళ్లలో మోదీ మార్క్ పాలన

- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమార్కెట్,జూన్5(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ అధికారం చేపట్టిన దగ్గర నుంచి దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని, మోదీ మార్క్ కనిపిస్తుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి, జాగృతి ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో మోదీ ప్రధానిగా పదవి సేకరించి 11ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు, అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో సైతం మోదీ తీసుకున్న నిర్ణయాలతో ప్రపంచదేశాల చూపు భారతవైపు పడిందన్నారు. కరోనా నియంత్రణలో మోదీ సాధించిన విజయం హర్షించదగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గెంటాల విద్యాసాగర్, కూసంపుడి రవీందర్, శీలం పాపారావు, రమేష్, రవికుమార్, రామలింగేశ్వరరావు, అంజయ్యయాదవ్, శ్యాంరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కత్తి, గొడ్డలితో యువకుడి దాడి

- ఐదుగురికి తీవ్రగాయాలు
- కంచె విషయంలో ఇరువర్గాల ఘర్షణ

చంద్రుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలంలో పోకలగూడెంలో గురువారం రాత్రి బాణోత్ నరసింహ అనే యువకుడు కత్తి, గొడ్డలితో దాడి చేసిన ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాణాత్ లచ్చిరాం, అన్నసూర్య వారి కుమారుడు నరసింహ ఇంటి పక్కనే నివాసం ఉంటున్న గుగులోత్ జుమ్మా కుటుంబానికి కంచె విషయంపై ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సమయంలో లచ్చిరాం కుమారుడు నరసింహ ఆగ్రహంతో జుమ్మ కుటుంబ సభ్యులపై కారం చల్లి గొడ్డలి, కత్తితో దాడికి దిగాడు. ఈ సమయంలో గ్రామస్థులు అడ్డుకున్న లెక్కచేయకుండా తొమ్మిది మందిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన గుగులోత్ జుమ్మ, దేవి, బాల్యా, కృషి, మంగిత్యాకు తీవ్రగాయాలు కాగా మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. దాడి ఘటనను గ్రామస్థులు పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకొని గాయపడ్డవారిని 108లో చంద్రుగొండ ఆసుపత్రికి అక్కడ నుంచి కొత్తగూడెం తరలించారు. కాగా దాడి చేసిన యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

- మహిళ మృతి
- ఇద్దరికి గాయాలు

దమ్మపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆటోను ప్రైవేటు బస్సు డీకొట్టడంతో ఒక మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడిన ఘటన మందలపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన వారు ఆటోలో కూలీ పనులు చేసుకునేందుకు వెళుతుండగా ఏపీ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ప్రైవేటు బస్సు మందలపల్లి గ్రామ సమీపంలో ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈఘటనలో కొత్తూరు గ్రామానికి చెందిన అద్దంకి పద్మ(36) మృతి చెందగా, గోపమ్మ, మారేశ్వరి గాయపడ్డారు. వీరిని సత్తుపల్లి వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు. అద్దంకి వీరయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య బైఠాయింపు

వేంసూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తనను అత్తారింటికి తీసుకువెళ్లడం లేదని ఓ వివాహిత భర్త ఇంటి ఎదుట బైఠాయించిన సంఘటన గురువారం వేంసూరు మండలం చౌడారం గ్రామంలో జరిగింది. చౌడారం గ్రామానికి చెందిన వరికూటి గోపికిషోర్ సత్తుపల్లికి చెందిన లక్ష్మీ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత తనను పట్టించుకోకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. అయినప్పటికీ గోపికిషోర్ లక్ష్మిని ఇంటికి తీసుకువెళ్లడం లేదు. లక్ష్మి గురువారం గోపికిషోర్ ఇంటిముందు బైఠాయించింది.

ఇసుక టిప్పర్లు సీజ్

వేంసూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తెలంగాణకు ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను పోలీసులు గురువారం పట్టుకున్నారు. లచ్చన్నగూడెం గ్రామసమీపంలో తనిఖీలు చేస్తుండగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

రోడ్డు ప్రమాదంలో 8 మందికి గాయాలు

- పేరుపల్లి సమీపంలో ఘటన



గాయపడిన క్షతగాత్రులు

కారేపల్లి, జూన్5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పేరుపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని పేరుపల్లి పంచాయతీ జామల్‌పల్లిలో జరిగిన వివాహవేడుకకు గుండాల మండలంలోని కాంచానపల్లి గ్రామానికి చెందిన వారు టాటా మ్యాజిక్ ఆటోలో పోలంపల్లి ద్వారా పేరుపల్లి వెళ్తున్న సమయంలో పోలంపల్లితండా వద్ద వాహన స్టీరింగ్ విరిగిపోవడంతో వాహనం అదుపుతప్పి రహదారికి పక్కకు దూసుకువెళ్లింది. దీంతో వాహనంలో ఉన్న 8మందికి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మహిళ మృతి



సత్తుపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని దామరచెరువు సమీపంలోని అడవిలో ఒక వృద్ధురాలు పడిపోయి ఉండగా అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. గురువారం సుమారు 70 ఏళ్ల వయస్సున్న వృద్ధురాలు అడవిలో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని అటవీ సిబ్బంది గమనించి సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు సత్తుపల్లి పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సీఐ కిరణ్ కోరారు.

ఎర్త్ సైన్స్ వర్సిటీకి
మంత్రివర్గ ఆమోదం

(5వ పేజీ తరువాయి)

లభించనుంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరును ఖరారు చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా పేరు మారుమోగనుంది. దక్షిణ భారతదేశంలో ఖనిజ నిధిగా ఉన్న భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఎర్త్‌సైన్స్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు అన్ని అనుకూలతలున్నాయి. కొత్తగూడెంలో బొగ్గుతోపాటు అన్ని సహజ వనరులున్నాయి. నేషనల్ హైవేకి సమీపంలో 300 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయానికి సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నవభారత్ లిమిటెడ్, ఫెరోఎల్లాయి, ఫెర్రో మెగ్నీషియం, విద్యుత్ ప్లాంట్ ఉన్నాయి. విద్యుత్ ప్లాంట్లు కూడా మరో 300 మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతానికి సమీపంలో ఐటీసీ పేపరు బోర్డు, హెవీవాటర్ ప్లాంట్ ఉన్నాయి. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా.. త్వరలోనే ఈ కల నెరవేరనుంది. రోడ్డు, రైలు, రవాణా మార్గాలు ఈ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్నాయి. 34 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తోంది. దీని వల్ల భవిష్యత్‌లో నీటి ఇబ్బందులుండవు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్, జూన్5(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్‌స్టేడియంలో మే1 నుంచి జూన్ 4 వరకు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాలు ముగిశాయి. నగర పరిధిలో సుమారు 23 శిబిరాలను ఏర్పాటు చేయగా 1672 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా క్రీడా విభాగాల శిక్షణా కేంద్రాలు ముగింపు రోజున పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, భద్రాదికొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, నగేష్, సాంబమూర్తి, గోపికృష్ణ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందిస్తున్న డీవైఎస్‌వో

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

- ప్లాస్టిక్ స్థానంలో.. సంచులు, బ్యాగులు అందుబాటులోకి తేవాలి
- మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య
- ఉమెన్స్ ఫర్ ట్రీ కార్యక్రమం ప్రారంభం





మొక్కను నాటుతున్న మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, వెలుగుమట్ల అర్బన్ పార్కులో న్యాయాధికారుల ప్రతిజ్ఞ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, ప్లాస్టిక్ రహిత ఖమ్మంగా మార్పుకు ప్రజల భాగస్వామ్యం కావాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యాన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పాల్గొన్నారు.అనంతరం ఖమ్మం డంపింగ్‌యార్డు, ఫ్రీడమ్‌పార్కు, ఖానాపురం ట్యాంకు బండ్‌పై మెప్మా ఆధ్వర్యంలో ఉమెన్స్ ఫర్‌ట్రీ అమృత్ మిత్రాల మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ నిర్మూలనపై మహిళా సంఘాలు ప్రజలకు అవగాహన కల్పించాలని వారు పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన సంచులు, బ్యాగ్‌లు ఉత్పత్తులు వాడేలా మార్పు ప్రజల్లో రావాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కను రక్షించేలా కాపాడాలన్నారు. వనమహోత్సవం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతర కార్యక్రమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. విద్యార్థులకు మొక్కల పెంపకంపై చిన్నతనం నుంచే అలవాటు జరిగేలా తల్లి,దండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యాన అధికారి బెల్లం రాధిక, మెప్మా జిల్లా మిషన్ సమన్వయకర్త సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, పారిశధ్య పర్యవేక్షకుడు సాంబయ్య, సీవోలు సల్మా, చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీవీ పాలెంలో వన మహోత్సవం

రఘునాథపాలెం: వీవెంకటాయపాలెంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, గ్రామపంచాయతీ ఉద్యోగులు,వైద్యఉద్యోగులు మొక్కలు నాటారు. ఏఎన్ఎం మేడా పుష్పావతి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, కార్యదర్శి కృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణయ్య, శారద పాల్గొన్నారు.

ఖమ్మం లీగల్: ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్కులో జరిగిన కార్యక్రమానికి న్యాయాధికారులు హాజరయ్యారు. ఏపూరి బిందు ప్రియ, నాగలక్ష్మి ఆధ్వర్యంలో అటవీ అధికారులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అటవీశాఖ అధికారులు

చెట్ల పెంపకాన్ని విరివిగా చేపట్టాలి

- అటవీ ప్రాంతంలో కోతుల కోసం పండ్ల చెట్లు పెంచాలి
- అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యమివ్వాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- వనమహోత్సవంపై సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, జూన్5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వనమహోత్సవంలో లక్ష్యం ప్రకారం చెట్లు పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వనమహోత్సవం కార్యక్రమంపై అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ, డీఎఫ్‌వో. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. అర్బన్ పార్క్, ఇతర పల్లె ప్రకృతి వనాలలో ప్లాస్టిక్ వాడకం పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం వన మహోత్సవం కింద 35.32 లక్షల మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. కోతుల బెడద కారణంగా అటవీ ప్రాంతంలో పండ్ల మొక్కలు, కూరగాయల మొక్కలు పెద్ద ఎత్తున పెంచాలని, జాతీయ రహదారులు, సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కెనాల్స్, ఇతర నీటిపారుదల ప్రాజెక్టు కెనాల్స్ స్థలంలో మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వనమహోత్సవం పోస్టర్, క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంపురస్కరించుకుని కలెక్టర్ మొక్కలు నాటారు. ఈసమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లాబీసీ సంక్షేమ అధికారిజ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, నీటిపారుదలశాఖ అధికారి వెంకట్రాం, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట, ఇందిరా డెయిరీపై..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు గురువారం కలెక్టరేట్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహణ, ఇందిరా డెయిరీ కార్యక్రమం అమలుపై అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను పెంచేలా అధికారులు కృషి చేయాలని, ఇందిరా డెయిరీ లక్ష్యం మేరకు పశువుల యూనిట్ గ్రౌండింగ్ చేయాలన్నారు.

పేదల సంక్షేమానికే ప్రభుత్వ పథకాలు

రాష్ట్రగిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల

నేలకొండపల్లి,జూన్5(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం రాజేశ్వరపురం గ్రామంలోని చౌక దుకాణంలో సన్నబియ్యాన్ని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని అందచేసారు. గత ప్రభుత్వంలోలా గాకుండా, ఇందిరమ్మ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే అందుతున్నాయని రాయల నాగేశ్వరరావు అన్నారు. ముందుగా పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. రాజేశ్వరపురం గ్రామంలో జరిగిన పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజుమేనకోడలు నామవరపు శ్రీను-ఉమారాణి కుమార్తెల ఓణీల వేడుకలో పాల్గొని చిన్నారులు వైష్ణవి, వర్షితలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొడాలిగోవిందరావు,బొడ్డు బొందయ్య, శాఖమూరి రమేష్, యడవల్లి నాగరాజు, బచ్చలకూరి నాగరాజు, అంజని పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని దండగ చేసిన కాంగ్రెస్

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

రఘునాథపాలెం,జూన్5(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని పండుగ చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని దండగ చేస్తోందని, రైతురుణమాఫీ, రైతుబీమా,రైతు భరోసా ఇవ్వలేదని అందుకే రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు పరిమిశెట్టి వీరబాబు కుటుంబ సభ్యులను గురువారం పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. మృతుడి భార్యకు రూ.10వేలు అందించారు. మాజీ వైస్ఎంపీపీ గుత్తా రవికుమార్, మాజీఆత్మకమిటీ ఛైర్మన్ భూక్య లక్ష్మణ్‌నాయక్, దొంతు సత్యనారాయణ, కార్పొరేటరు నాగండ్ల కోటేశ్వరరావు బీఆర్ఎస్ నాయకులు మోతారపు సుధాకర్, గొర్రి శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న పువ్వాడ

పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం

ఖమ్మంరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం ఏదులాపురం గ్రామంలో మునిసిపల్ సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వాహనాల్లో వేయాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, కిరణ్, నాయకులు దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ విలేకరిపై కేసు నమోదు చేయాలి

తిరుమలాయపాలెం, జూన్5(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల పట్ల దురుసుగాప్రవర్తిస్తూ,డబ్బులు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న విలేకరి బోడ పట్ల సతీష్‌పై చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్లు లలిత, నాగలక్ష్మి, పార్వతి, ఉర్మిళ, రేణుక జిల్లా అధికారులను కోరారు. తమ విధులకు ఆటంకం కలిగిస్తూ, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడన్నారు. కులంపేరుతో దూషిస్తున్నారని వ్యక్తిగత ఫోటోలు తీస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

భూ భారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం







దరఖాస్తు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్, ఫిర్యాదులు స్వీకరిస్తున్న రాయల, ఆర్డీవో నర్సింహారావు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్

ఖమ్మంరూరల్, జూన్5(ఆంధ్రజ్యోతి): భూ భారతితో రైతుల భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ తెలియచేశారు. మండల పరిధిలోని ఆరెంపులలో గురువారం నిర్వహించిన భూభారతి గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐలు ప్రసాద్, వసంత, గ్రామపెద్దలు బండి జగదీష్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భూమికష్టాలను తొలగించేందుకే: ఆర్డీవో

రఘునాథపాలెం: భూదస్త్రాల సమస్యలను తీర్చి రైతుల సమస్యలను తొలగించేందుకే భూభారతి పథకాన్ని అమలు చేస్తున్నారని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, తహసిల్దారు శ్వేత పేర్కొన్నారు. గురువారం మంచుకొండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరని పోర్టల్ ద్వారా వంశపారంపర్యంగా వచ్చిన భూములను రైతులను కొల్పోయారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంలో భూ సమస్యలను పరిష్కారం చూపేందుకు భూ భారతి అమలులోకి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. నాయకులు బద్రునాయక్, బానోత్ ఉపేందర్,

రైతుల భూములకు రక్షణ కవచం
రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల

కూసుమంచి: రైతుల భూములకు భూ భారతి చట్టం రక్షణకవచంలా నిలుస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. తహసీల్దార్ రవికుమార్‌తో కలిసి.. రైతుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం కానున్నాయని తెలిపారు. రైతులు సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రజాకార్లను తరిమి కొట్టిన సుబ్బయ్య

ఖమ్మంరూరల్, జూన్5(ఆంధ్రజ్యోతి): నైజాం ప్రభుత్వాన్ని ఎదిరించి తెల్దారుపల్లిలో రజాకార్లను వీరోచితంగా ఎదుర్కొన్న యోధుడు తమ్మినేని సుబ్బయ్య అని సీపీఎం సీనియర్ నాయకుడు సిద్దినేని కోటయ్య, సీపీఎం జిల్లా కమిటి సభ్యులు నండ్రా ప్రసాద్ అన్నారు. మండలంలోని తెల్దారుపల్లిలో తమ్మినేని సుబ్బయ్య 48వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన సుబ్బయ్య శిలాఫలకాన్ని సుబ్బయ్య సతీమణి తమ్మినేని కమలమ్మ, వారి కుమారులు తమ్మినేని వెంకట్రావు, తమ్మినేని కోటేశ్వరరావు ఆవిష్కరించారు. సుబ్బయ్య స్ఫూర్తితో యూవత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జాలారు సంగయ్య, వెంకన్న, రాజశేఖర్, రంజాన్, జక్కంపూడి కృష్ణ, నాగేశ్వరరావు, పాపా చారి, కర్లపుడి వెంకటేశ్వర్లు, సందీప్, పట్టాభి పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్5 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్ పెట్టి సాగర్ కాలువలో చేపలు పడుతుండగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బుధవారం మధ్యాహ్నం తురాయిరాజు(28), అతడి స్నేహితులైన సైదులు, తూరాయి. వీరభద్రం, తూరాయి. శివ ఎల్‌బీనగర్ ఎన్ఎస్పీ కాలువలో కరెంట్‌తో చేపలు పట్టేందుకు వెళ్లారు. కరెంట్ వైర్లను పక్కనే ఉన్న కరెంట్ లైన్‌కు తగిలించి ఒడ్డున నిలబడి చేపలు పడుతుండగా రాజు ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడిపోయాడు. కరెంట్‌షాక్‌తో స్పృహ కోల్పోవటంతో 108 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. గురువారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సైదులు, వీరభద్రం, శివలపై కేసు నమోదు చేసినట్లు ఖానాపురంహవేలి పోలీసులు తెలిపారు.

'అర్బన్ మలేరియా'ను పరిశీలించిన డీఎంహెచ్‌వో

ఖమ్మం కలెక్టరేట్, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపాలిటీ పరిధిలో మలేరియా నివారణ కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి బి కళావతిబాయి పరిశీలించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం హెల్త్‌ఇన్స్పెక్టర్ మహ్మద్ మన్నన్, హెల్త్ అసిస్టెంట్ హరీష్, ఫీల్డ్ వర్కర్ రామకృష్ణలతో కలిసి క్షేత్రస్థాయిలో అర్బన్ మలేరియా సిబ్బంది పనులను పరిశీలించారు. రోటరీ నగర్,లెనిన్ నగర్, సారధినగర్ ఏరియాలలోని మురికి కాలవలలో యాంటీ లార్వాస్ప్రేయింగ్‌ను పరిశీలించారు. కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించి ప్రజలను ఆరోగ్యంగా కాపాడాలని డీఎంహెచ్‌వో చెప్పారు.

ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు చర్యలు చేపట్టాలి

మండల ప్రత్యేకాధికారి రవికుమార్

నేలకొండపల్లి, జూన్5 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వైరీత్యాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రవికుమార్ గ్రామ, మండలస్థాయి అధికారులకు సూచించారు. గురువారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న రైతువేదికలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన అవగాహనా సదస్సులో రవికుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో గ్రామాల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్దలతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని సూచించారు. కూలటానికి సిద్ధంగా ఉన్న, శిథిల ఇళ్లు, బలహీనంగా ఉన్నకాల్వకట్టలు, చెరువుకట్టలు తదితర విషయాలను వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి మండల అధికారుల దృష్టికి తేవాలన్నారు. గ్రామాలతో పాటుగా మండల అధికారులతో సైతం ఓవాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తామన్నారు.అనుకోకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎటువంటి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.



ఖమ్మంఖానాపురంహవేలి: విపత్తు సమయం చెప్పిరాదని, అది జరిగిన వెంటనే స్పందించేందుకు యువత ముందుండాలని జాతీయ విపత్తు నివారణా సంస్థ ఇన్‌స్పెక్టర్ గౌతమ్, డీఈవో కె. సత్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు విపత్తు నివారణా చర్యలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(యన్‌డిఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి: జేడీఏ

తిరుమలాయపాలెం, జూన్5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో వివిధ రకాల అంటువ్యాధులు ప్రబలేఅవకాశం ఉందని, వీటి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జేడీఏ పుల్లయ్య తెలిపారు. గురువారం రైతువేదికలో ప్రకృతి వైపరిత్యాలు, నివారణ చర్యలు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు.వాడకంలేని బావులు గుర్తించి వాటి నిపూడ్చివేయాలన్నారు. గతేడాదిమండలంలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయని,ఆ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ, ఏవోసీతారాంరెడ్డి, వైద్యాధికారులు వసుంధర, హారిక, ఏఈ ఖలీల్, ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏడాది వేడుకలు

ఖమ్మంసంక్షేమ విభాగం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):ఖమ్మంఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుంబూరి దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్ కలిసి కేక్ కట్ చేశారు. ఎంపీ రఘురాంరెడ్డి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రక్తదానశిబిరం,ఆటోడ్రైవర్లుకు చొక్కాలుపంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన

నేలకొండపల్లి,జూన్5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య ఆదేశించారు. గురువారం రాజారాం పేటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయానికి శంకు స్థాపన చేశారు. అన్ని గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ

గురుకుల కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంరూరల్, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లిలోని ఖమ్మం సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీకళాశాలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్‌రావు గురువారం తెలిపారు. 2025 -26 విద్యా సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో(ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 23లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

8న జిల్లా నాటక సమాఖ్య సమావేశం

ఖమ్మంసాంస్కృతికం, జూన్5(ఆంధ్రజ్యోతి): జిల్లా నాటక సమాజాల సమాఖ్య కార్యవర్గ సమావేశం ఈనెల 8న ఖమ్మంలోని బాలభవన్‌లో ఉదయం 9 గంటలకు జరుగుతుందని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ముల్లంగి గాబ్రియేల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమాఖ్య పిలుపులో భాగంగా రాష్ట్ర సమాఖ్య సూచనలు, జిల్లాలో కళారంగ స్థితిపైచర్చ, భక్తరామదాసు కళాక్షేత్రం రుసుము తగ్గింపు తదితర విషయాలపై విస్తృత చర్చ ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖమ్మం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఛైర్‌పర్సన్ నిష్కాశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, సోషల్, సంగీతం, గాత్రం,వాయిద్య పరికరాలులలో ఖాళీలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హత ఆసక్తి గత అభ్యర్థులు ఈ నెల 12లోగా దరఖాస్తులను అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440525093లో సంప్రదించాలని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు ..

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ తోపాటు ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మొదటి దఫా అడ్మిషన్లు వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లలో ప్రవేశాలకు రూ.100 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న పాలకవర్గాలు

తిరుమలాయపాలెం, జూన్5(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కలిపించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే బషీరుద్దీన్ అన్నారు. గురువారం తిరుమలాయపాలెంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్‌యాత్ర 7వరోజు మండలానికి చేరింది. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకుడు కొమ్ము శ్రీను, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, చింతల రమేష్, శీలం వీరబాబు, ముత్తారావు, విజయ్, నేర్సుల వెంకటేష్, వీరన్న పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నదానం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయనగర్ కాలనీలోనిని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రోహిణి సత్యనారాయణ, మాజీ కార్పోరేటర్ మచ్చా. నరేందర్, భాగం హేమంతరావు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేవీఎల్ 41వ వర్ధంతి

నేలకొండపల్లి,జూన్5(ఆంధ్రజ్యోతి):పీడీఎస్‌యూలో చురుగ్గా పని చేస్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని ఉద్యమాలు నిర్వహించిన కేవీఎల్ ఆశయ సాధనకు కృషి చేయటమే ఆయనకిచ్చే నిజమైన నివాళని సీపీఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ నాయకుడు సీవైపుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నేలకొండపల్లి పాత బస్టాండ్ సెంటర్లో జరిగిన కేవీఎల్ 41వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పగిడికత్తుల వెంకటేశ్వర్లు, పగిడికత్తుల రామదాసు, చిర్రా భిక్షం, పగిడికత్తుల నాగేశ్వరరావు, ప్రకృతి వైద్యుడు పీసీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్5(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మూడు రోజుల క్రితం గుర్తు తెలియని ఓ వృద్ధుడు(70) డోర్నకల్ రైల్వేలైన్ వద్ద మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. బంధువులు ఎవరు రాకపోవటంతో అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. ఆయన బల్లేపల్లి వైకుంఠదామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

వైరా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా భూసమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్పష్టం చేశారు. మండలంలోని పూసలపాడు గ్రామంలో గురువారం జరిగిన భూ భారతి గ్రామసభను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే ఈ భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఫ్రీజర్ బాక్సు అందజేత



ఫ్రీజర్ బాక్సు అందిస్తున్న నాయకులు

తల్లాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ అందించారు. శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఫ్రీజర్ బాక్స్‌ను కుమారుడు శెట్టిపల్లి సందీప్ పంచాయతీకి బహూకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు గణేశుల రవి, నలజాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, తోట శ్రీకాంత్, చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాగులపై అసంపూర్తిగా కల్వర్టులు

- రైతులకు తప్పని తిప్పలు
- నిధులున్నా నిర్మాణంలో ఆలస్యం

మధిరరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో పలు రహదారుల్లో వాగుల మధ్య కొన్ని చోట్ల అసంపూర్తిగా కల్వర్టుల నిర్మాణం, మరోచోట్ల శిథిలం కావడంతో అటు వైపుగా పొలాలకు వెళ్లే



నక్కలగరుబు వద్ద పాలవాగుపై అసంపూర్తిగా ఉన్న కల్వర్టు

రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు మండలంలోని నక్కలగరుబు, బయ్యారం గ్రామాల మధ్య పాలవాగుపై అసంపూర్తిగా కల్వర్టు నిర్మించి వదిలేశారు. 15 ఏళ్ల క్రితం నక్కలగరుబు సమీపంలోపాలవాగు వద్ద కల్వర్టు నిర్మించి సగంలోనే వదిలేశారు. ఆ తర్వాత పట్టించుకునేవారులేరు. నక్కలగరుబు గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే ఈవాగుపై నుంచే వెళుతుంటారు. భాగా వర్షాలు కురిసినప్పుడు వాగు పొంగి ప్రవహిస్తుంటుంది. ఇక్కడ కల్వర్టు సరిగా లేకపోవడంతో వర్షాకాలం రైతులు పొలాలకు వెళ్లాలంటే రైతులు అవస్థలు పడుతున్నారు. అయితే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కొద్దిరోజుల క్రితం నక్కలగరుబు , వంగవీడు మధ్య రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అయితే ఈ రహదారిలోనే ఉన్న పాలవాగుపై నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరుకాలేదు. రైతులకు ఇబ్బంది లేకుండా కల్వర్టు నిర్మిస్తే పొలాలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుదని రైతులు కోరుతున్నారు. అలాగే ఇల్లూరు, దేశినేనిపాలెం గ్రామాల మధ్య బుడ్డవాగుపై కల్వర్టు శిథిలమైంది. 8 ఏళ్లక్రితం ఈ రహదారి నిర్మించినప్పటికీ అప్పుడు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిధులు సరిపడక కల్వర్టు నిర్మాణం వదిలేశాడు. దీంతో అప్పటి నుంచి పట్టించుకునేవారు లేరు. దేశినేనిపాలెం గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఎక్కువభాగం ఇల్లూరు వైపు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. రైతులకు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. గ్రామాల్లో వాగులపై కల్వర్టులు నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



ఇల్లూరు, దేశినేనిపాలెం మధ్య వాగుపై శిథిలమైన కల్వర్టు



మొక్క నాటుతున్న సింగరేణి జీఎం షాలేం రాజు

వనమహోత్సవంలో పాల్గొన్న జీఎం

సత్తుపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు మొక్కలు నాటారు. స్థానిక జేవీఆర్ ఓపెన్ కాస్ట్ కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవకోటి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలాని, ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా తగ్గించాలన్నారు. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల పీవోలు ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు, రక్షణ అధికారి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయండి

- రెవెన్యూ సిబ్బందికి అదనపు కలెక్టర్ సూచన



సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కొణిజర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతులు దరఖాస్తులు చేసుకున్న ప్రతి దరఖాస్తును వెంటనే ఆన్‌లైన్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గురువారం మునగాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. రైతులు ఇబ్బందిపడకుండ ప్రతి దరఖాస్తును ఆన్‌లైచేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని తెలిపారు. మునగాలలో మొత్తం 417 దరఖాస్తులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏన్కూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు, ప్రకృతి వైపరిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.సాయినాథ్ అన్నారు. గురువారం స్థానిక రైతువేదికలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరదల వల్ల పంట నష్టం జరిగితే వెంటనే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరి రావు, సీడీపీవో దయామణి, ఏవో నరసింహారావు, డాక్టర్ రాములు, మౌనిక, ఏపీఎం వెంకటరామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు , పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లి మండలంలో ఎమ్మెల్యే రాగమయి పర్యటన



వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సత్తుపల్లి మండలం కిష్టారం, కాకర్లపల్లి గ్రామాలతోపాటు సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో గురువారం పర్యటించారు. కిష్టారంలో సింగరేణి ఓపెన్ కాస్టు వల్ల దెబ్బతిన్న ఇంటిని సింగరేణి సంస్థ పునర్నించిన సందర్భంగా ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఇంటిని ప్రారంభించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు, కిష్టారం పీవో నరసింహారావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు పాల్గొన్నారు. కాకర్లపల్లిలో జరిగిన ముత్యాలమ్మ ఆలయ పునప్రతిష్ట, బొడ్రాయి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రత్యేయ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

పర్యావరణ దినోత్సవంలో ఎమ్మెల్యే

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి పాల్గొన్నారు. స్థానిక వేశ్యకాంతల చెరువు వద్ద నిర్వహించిన వనమహోత్సవంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నరసింహ పాల్గొన్నారు.

రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంజేపీ అధ్యాపకులు

బోనకల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన వత్సవాయి నరేష్ బోనకల్ మహాత్మా జ్యోతిభా పూలే బాలుర గురుకుల పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఖమ్మం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వచ్చే క్రమంలో నరేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని మోటమర్రి గ్రామంలో గురువారం అతడి కుటుంబానికి ఉమ్మడి జిల్లా బీసీ గురుకులాల ఉద్యోగస్తులు కలిసి రూ. 2 లక్షల ఆర్థిక సాయంను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ ఆర్సీవో సిహెచ్ రాంబాబు, డీసీవో సుష్మా, జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల్లో జాప్యం

కారేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పేరేపల్లి వరకు సాగుతున్న బిటిరోడ్డు నిర్మాణం పనులు నత్తలు నవ్వుకునేలా సాగుతున్నాయి. గతంలో ఉన్న బిటి రోడ్డుపూర్తిగ ధ్వంసం కావడంతో ప్రభుత్వం 24 అడుగుల బిటిరోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసింది. కోట్లదిరూపాయాలు మంజూరైన రహదారిపనులు నత్తనడకనసాగుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మొత్తం కంకరపోయడంతో వాహనాలు వచ్చే సమయంలో దుమ్ములేస్తుండటంతో ద్వీచక్రవాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పనుల నిర్వహణపై సంబంధిత అధికారులను వివరణకోరగా త్వరలోనే పనులు మొదలు పెడతామన్నారు.



కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులు

మొక్కలు నాటిన మున్సిపల్ సిబ్బంది

వైరా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైరాలో గురువారం అమృతమిత్ర పథకంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది 11వ వార్డు సోమవరం నల్లచెరువు గట్టుపై మొక్కలు నాటారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు పాల్గొన్నారు. ముందుగా మునిసిపల్ సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతరం మొక్కలు నాటి వాటి ఆశ్యకత గురించి కమిషనర్ వివరించారు. మునిసిపాలిటీలోని పలు శాఖాల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్

చింతకాని, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్తును అందజేస్తున్నామని డీఈ నంబూరి రామారావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బస్వాపురం, రామకృష్ణాపురం, అనంతసాగర్ గ్రామాల్లో పలు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. వ్యవసాయ మోటార్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఈ చావా శ్రీధర్, లైన్‌మెన్‌లు,కన్నెబోయిన సీతరామయ్య, కుటుంబారావు, కోటేశ్వరరావు, నరసింహరావు, రామారావు పాల్గొన్నారు.

ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించాలి

బోనకల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నివారణకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం. రమాదేవి సూచించారు. బోనకల్ రైతు వేదికలో గురువారం విపత్తుల నివారణకు సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో వరదల వల్ల ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించాలన్నారు. వర్షాలు, ఈదురు గాలుల వలన విద్యుత్ తీగలు కిందకు వేలాడితే తగు సమాచారాన్ని విద్యుత్‌శాఖకు ఇవ్వాలని కోరారు. వర్షాల వల్ల ఆస్తులకు నష్టం వాటిల్లితే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి విజయ భాస్కరరెడ్డి, ఎంఈవో దామాల పుల్లయ్య, మట్టా రవి కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి



బాలాజీనాయక్ (ఫైల్‌ఫొటో)

తల్లాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తేజావత్ బాలాజీనాయక్(54)బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. బాలాజీనాయక్ కలకత్తాలో సరుకు దిగుమతి చేసేందుకు లారీతో కిరాయికి వెళ్లాడు అక్కడే గుండెపోటు రావిడంతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. 20 ఏళ్లుగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. బీజేపీ కో ఆపిరేటివ్ సెల్ జిల్లా అధ్యక్షుడుగా, ప్రస్తుతం గిరిజనమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గురువారం బాలాజీనాయక్‌కు బీజేపీజిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, ఖమ్మంపార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త నంబూరు రామలింగేశ్వరరావు, జిల్లా నాయకులు అపతి వెంకటరామారావు, గాదే కృస్ణారావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా నాగులు, పెరికే కిరణ్ నివాళులర్పించారు.

విపత్తుల నివారణకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న మండల ప్రత్యేక అధికారి సునీత

కల్లూరు, జూన్5 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో గురువారం ప్రకృతి వైపరీత్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పత్యేక అధికారి సునీత, ఎపిడిఓ చంద్రశేఖర్, తహసిల్దార్ పి సాంబశివుడులు మాట్లాడుతూ.. రానున్న వర్షాకాల సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే తీసుకోవాల్సిన నివారణ చర్యలపై వారు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రధాన రహదారుల ప్రక్కన జనవాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. నీటిపారుదల, పోలీసు, విద్యుత్ రెవిన్యూశాఖల అధికారులు పరస్పరం సహకారం అందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, గుంతల్లో మత్స్యశాఖ వారిచే గంబుషియా చేపలను తెప్పించి వదలాలని కోరారు. ఐసిడిఎస్ విద్యుత్, వైద్య శాఖతో పాటుగా పలు శాఖ అధికారులు, కార్యదర్శిలు అంగన్వాడీలు, ఆషాలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నిమ్మవాగు వంతెన

ఏన్కూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం రాయమాదారం గ్రామ సమీపంలోని నిమ్మవాగు వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉంది. వంతెనకు రెండువైపులా రక్షణ గోడలు, ప్రమాద హెచ్చరికలను తెలిపే బోరు లేక ప్రమాదభరితంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వంతెన లోలెవల్‌లో ఉండడంతో కొద్దిపాటి వర్షానికే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ ఆర్అండ్‌బీ రహదారికి కూడా వయా పంగిడి, ఈర్లపుడి మీదుగా ఖమ్మంకు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రాజలింగాల, తిమ్మారావుపేట, పికే బంజర, మూలపోచారం, సూర్య తండా, మరసకుంట, రాయమాదారం గ్రామాల మధ్య నిత్యం రహదారి గుండా ఖమ్మంకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న వంతెనకు తక్షణమే సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులురక్షణ గోడలు ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా నాయకుడు మదన్‌లాల్



సంతాపసభలో నివాళులు అర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

కొణిజర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు ఎన్ని ఉన్న ప్రజా అభివృద్దే ధ్యేయంగా పని చేసిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ అని అఖిలపక్ష నాయకులు కొనియాడారు. గురువారం కొణిజర్లలో నిర్వహించిన మదన్‌లాల్ సంతాపసభలో అఖిలపక్ష నాయకులంతా పాల్గొని మదన్‌లాల్ సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పలువురు మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలాకాపాడుకున్న వ్యక్తి మదన్‌లాల్ అని, భౌతికంగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తాతా సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, చిరంజీవి, న్యూడెమోక్రసీ నాయకులు షేక్ ఖాసీం, సీపీఎం జిల్లా నాయకులు కొప్పుల కృష్ణయ్య, తెలంగాణ ఉద్యమనాయకులు జడల వెంకటేశ్వర్లు మదన్‌లాల్ సేవలను కొనియాడారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు పోట్ల శ్రీనువాసరావు, కిలారు కిరణ్, పాముల వెంకటేశ్వర్లు, బోడపోతుల బాబు, దొడ్డపునేని రామారావు, సామినేని నరసయ్య, కుర్రా కాంతమ్మ, బూర ప్రసాద్, రోషన్‌బేగ్, చల్లా మోహన్‌రావు, మంగిలాల్, రమేష్, సిరియాలు, పోగుల శ్రీను, ఆర్‌వి, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తన కొనుగోళ్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

మధిరరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని మధిర వ్యవసాయశాఖ ఏడీఏ విజయచంద్ర అన్నారు. గురువారం మధిరలో రైతువేదికలో జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. జీలుగు విత్తనాలు సబ్సిడీపై ప్రభుత్వం ఇస్తుందని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయశాస్త్రవేత్తలు రుక్మిణీదేవి, భరత్ మాట్లాడుతూ.. యూరియాను దఫాలుగా వేసుకోవాలని, ఒకేసారి వేయడం వల్ల పంటలకు అధిక చీడపీడలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. శాస్త్రవేత్త నాగస్వాతి, ఏవో సాయిదీక్షిత్, ఉద్యానశాఖాధికారి విష్ణు, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

వేంసూరు పాఠశాలకు గ్రీన్ చాంపియన్ అవార్డు

వేంసూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనపర్చిన సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి గ్రీన్ చాంపియన్ పురస్కారాలను ప్రకటించింది. దీనిలో భాగంగా వేంసూరు మండల జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలకు ప్రథమ స్థానం దక్కింది. గురువారం సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ బోర్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఆకుటి రాంబాబు పురస్కారాన్ని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ అమ్మద్ నదీమ్, రవి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబును డీఈవో సామినేని సత్యనారాయణ, సీఎంవో రాజశేఖర్ అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- నారపనేనిపల్లిలో విద్యార్థులు, తల్లిదండ్రులకు వరాలిచ్చిన కలెక్టర్

వైరా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్‌స్థాయి విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. వైరా మండలంలోని నారపనేనిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాశాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ డీఈవో సామినేని సత్యనారాయణ గురువారం సందర్శించి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గత ఏడాది నాల్గోతరగతి చదివిన ఏకైక విద్యార్థిని నందిగామ కీర్తనను కలెక్టర్ అభినందించారు. ఆ చిన్నారి తండ్రి అనిల్‌శర్మను కూడా కలెక్టర్ అభినందించి ఇతర తల్లిదండ్రులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని వ్యాఖ్యానించారు. గత సంవత్సరం ఈ పాఠశాలలో కేవలం కీర్తన మాత్రమే చదువుతూ పాఠశాల మూతపడకుండా కాపాడటం మిగిలిన తల్లిదండ్రులు గుర్తించాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కోతుల బెడద అధికంగా ఉండడంతో పాఠశాల ప్రహరీగోడ చుట్టూ కలెక్టర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. పాఠశాలలో కనీసం 20మంది విద్యార్థులను ఈ విద్యాసంవత్సరంలో చేర్పించాలని తల్లిదండ్రులను కలెక్టర్ కోరారు. గ్రామాల్లో ఒకటి నుంచి ఏడోతరగతి వరకు చదివే వయస్సున్న విద్యార్థుల సంఖ్య 29మంది ఉన్నారని, వారిలో కనీసం 20మందిని ఈ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. పిల్లలందరిని ప్రభుత్వ పాశాలల్లో చేర్పిస్తే తల్లిదండ్రులు అడిగే సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ విద్యాసంవత్సరంలో 11మంది పిల్లలను ప్రభుత్వపాశాలలో చేర్పించటానికి తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయటం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. అయితే గ్రామంలో ఉన్న 29మంది విద్యార్థుల్లో కనీసం 20మంది విద్యార్థులు పాఠశాలలో చేరాలని కలెక్టర్ కోరారు. ఇప్పుడున్న టీచర్లకు అదనంగా మరో టీచర్‌ను నియమించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు వీలుగా రవాణా సౌకర్యం కోసం ఒక ఆటో ఏర్పాటుచేయాలని ఆర్టీవోను కలెక్టర్ ఆదేశించారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యా ఫలితాలు మెరుగ్గా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1500ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని వాటిలో 60పాఠశాలలు జీరో స్థాయికి పడిపోయాయని తెలిపారు. జీరో స్థాయిలో ఉన్న పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి వాటిని కొనసాగిస్తామని తెలిపారు. ఎంపీడీవో సరస్వతీ, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ డీఈ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్, అదనపు కలెక్టర్

సాగులో రసాయనాల వాడకం తగ్గించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

తల్లాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయసాగులో రసాయనాల వాడకాన్ని తగ్గించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ అన్నారు. గురువారం తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో వ్యవసాయశాఖ, కృషి విజ్ఞానకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తక్కువ యూరియవాడి సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. ఉద్యానశాస్త్రవేత్త డాక్టర్‌వి.చైతన్య మాట్లాడుతూ.. నీటిని ఆదాచేసి భావితరాలకు ఉపయోగపడేల చేయాలని, చెట్లనుపెంచడం ద్వారా పర్యావరణం కాపాడాలని కోరారు. వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఫణిశ్రీ మాట్లాడుతూ.. పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయం పొందాలని తెలిపారు. మండల శాఖ అధికారి డాక్టర్ ఎం.రాకేష్, ఉద్యానశాఖ అధికారి నగేష్, మండల వ్యవసాయాధికారి ఎండీ తాజుద్దీన్ పాల్గొన్నారు.